సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
78932 44734
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

కార్మికుడికి భద్రత ఏది?



కనీస భద్రత లేకుండా విద్యుత్ స్తంభం ఎక్కిన కార్మికుడు

మల్కాపురం: అసలే ఎండలు భగభగమంటున్నాయి. నీడన ఉంటేనే కళ్లు తిరిగే విధంగా సూరీడు మండిపోతున్నాడు. మరి తీవ్ర ఎండలో పని చేసే కార్మికుడికి ఎలా ఉంటుందో చెప్పనక్కర్లేదు. శ్రీహరిపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్లు, యాంగిలర్స్ మార్పు వంటి వార్షిక మరమ్మతులు చేపడుతున్నారు. అయితే విద్యుత్ స్తంభాలు ఎక్కే ప్రతి కార్మికుడికి కనీస భద్రత కల్పించాల్సి ఉంటుంది. వారికి హెల్మెట్, నడముకు సేఫ్టీ బెల్ట్, రబ్బర్ హ్యాండ్ గ్లౌజులు ఇలా భద్రత పరికరాలు ఇవ్వాల్సి ఉంది. కానీ శ్రీహరిపురం పరిధిలో విద్యుత్ వైర్లు సరి చేసేందుకు స్తంభంపై పని చేసే కార్మికుడికి ఎలాంటి భద్రత వసతులు కల్పించలేదు. ఎండ వేడికి వారు కళ్లు తిరిగి ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు సమాధానం చెబుతారు?.

అపూర్వ కలయిక.. ఆత్మీయ వేడుక



కణితి హైస్కూల్ 1989-1990 విద్యార్థులు

కూర్మన్నపాలెం: అక్కడ ఆత్మీయత.. అనురాగాలు వెల్లివిరిశాయి. నవ్వుల పువ్వులు పూశాయి. కేరింతలు వినిపించాయి. అంతటి అపూరవ ఘట్టానికి వేదికైంది కణితి జిల్లా పరిషత్ హైస్కూల్. ఈ పాఠశాలలో 1989-1990 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన నాటి విద్యార్థులు 35 ఏళ్ల తర్వాత సోమవారం పాఠశాల ఆవరణలో కలిశారు. ఆటపాటలతో సందడి చేశారు. నాటి ప్రధానోపాధ్యాయుడు గరిమెళ్ల సాంబశివరావు, ప్రకాశ్, ఉపాధ్యాయులు ఎస్. సరోజని తదితరులను ఘనంగా సన్మానించారు. స్వర్గీయులైన ఉపాధ్యాయులు, విద్యార్థులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఆంజనేయులు, శ్రీనివాసరావు, త్రినాథ్, సన్యాసిరావు, పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతకు ప్రాధాన్యం



సీఐఎస్ఎఫ్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీజీఎం మహంతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో సోమవారం సీఐఎస్ఎఫ్ ఫైర్ వింగ్ ఆధ్వర్యంలో ప్లాంట్‌లోని ఫైర్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన అగ్నిమాపక వారోత్సవాలను స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) రంజన్ మహంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యంత్రాలు, పనిముట్లు రక్షణలో ఫైర్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో భాగంగా సీజీఎం మహంతి, జీఎం ఫణికుమార్, ఉప కమాండెంట్ నవీన్‌కుమార్‌లు సీఐఎస్ఎఫ్ ఫైర్ వింగ్‌కు చెందిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ప్రమాదాల రక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు.

ముగిసిన బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు

కంచరపాలెం: అమెచ్యూర్ బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర(అబా) 7వ రాష్ట్ర బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారంతో ముగిశాయి. విశాఖ బాక్సింగ్ అసోసియేషన్, నగర్ బాక్సింగ్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులుగా కైలాసపురం మధుసూదన్ నగర్‌లో పోటీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 90 మంది బాక్సర్లు వివిధ విభాగాలు, బరువు విభాగాల్లో పాల్గొని ప్రతిభ చూపారు. ముఖ్య అతిథి ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సుధాకర్ విజేతలకు బహుమతులు అందజేశారు. విజేత బాక్సర్లు ఈ నెల హైదరబాద్‌లో జరిగే బీఎఫ్ఐ నేషనల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అబా అధ్యక్షుడు రఘురామ్, కార్యదర్శి వాసుపల్లి అమ్మోరు, ఎస్పీటీఈ పోర్ట్ వర్కింగ్ అధ్యక్షుడు బి.వెంకట్, పోర్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు, రూబెన్ పాల్గొన్నారు.

- మద్యం, గంజాయి సేవిస్తూ దాడులు
- వ్యవసాయ పనులకు వెళ్లేందుకు భయపడుతున్న వైనం
- గతంలో తోటలను తగలబెట్టిన ఆకతాయిలు
- బీడుభూములుగా పంట పొలాలు

రైతులకు ఆకతాయిల బెడద!



89వ వార్డు శివారు ప్రాంతంలో ఖాళీగా ఉన్న పంటపొలాలు

ఆ శివారు గ్రామ రైతులు ఆకతాయిల బెడదతో సాగుకు దూరమవుతున్నారు. మందుబాబులు మత్తులో అలజడి చేయడంతో పొలాలకు వెళ్లడానికి భయపడుతున్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పంటలు వేస్తే ఎక్కడ నాశనం చేస్తారోనని వణుకుతున్నారు.

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు పెందుర్తి మండల పరిధిలో ఉన్న కంపరపాలెం రైతులకు ఆకతాయిల బెడద శాపంగా మారుతోంది. ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండడంతో ఒంటిరిగా పొలాలకు వెళ్లే వారిపై మత్తులో ఉన్న వారు దాడులకు తెగబడుతున్నారు. ఈ ప్రాంతంలో చెట్లు, పొదలు ఎక్కువగా ఉండడంతో చల్లగా ఉంటోంది. దీంతో ఆ ప్రాంతాలను యువకులు మద్యం సేవించే స్పాట్‌గా మలుచుకున్నారు. వ్యవసాయ పనులకు మహిళలు వస్తుంటారని మగతోడు లేక పోతే ప్రమాదమేనని రైతులు వాపోతున్నారు. ఒంటిరిగా పంపిచలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పంటపొలాల వద్ద మద్యం సీసాలు, వ్యర్థాలు

సరుగుడు తోటను కాల్చేశారు

కొన్నేళ్ల కిందట ఇక్కడ ఆకతాయిలు సరుగుడు తోటల్ని కాల్చేశారు. అప్పటి నుంచి ఆ తోటలు వేయడం మానేశామని రైతులు చెబుతున్నారు. ఇవి వేయకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. అన్ని ఖర్చులూ పోయి 5 ఏళ్లకు ఎకరాకు రూ. లక్ష పైగా ఆదాయం వచ్చేదని. ఆకతాయిలకు భయపడి ఆదాయం కోల్పోతున్నామంటున్నారు. ఇటీవల వరి కుప్పల్ని కూడా తగలబెట్టారని రైతులు వాపోతున్నారు.

అంతటా మద్యం సీసాలే...

పంట పొలాల వద్ద మద్యం సీసాలే దర్శనమిస్తున్నాయి. చెట్ల కింద వ్యర్థాలు, ఖాళీ సీసాలు భారీ స్థాయిలో ఉన్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయాయి. వీరి బెడదకు చెక్ పెట్టేలా పోలీసులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పనులకు వెళ్లేందుకు భయం



ఇక్కడ ఆకతాయిల వల్ల వ్యవసాయనులకు వెళ్లేందుకు భయపడుతున్నాం. వారి ప్రవర్తన వల్ల ఒంటిరిగా వెళ్లలేకపోతున్నాం. కొన్ని రకాల పంటలు వేయలేక భూములను బీడుగా వదిలేస్తున్నాం. చాలా నష్టపోతున్నాం. ఈ ప్రాంతంలో ఆకతాయిలు సంచరించకుండా చర్యలు చేపట్టాలి.

కంపర రామకృష్ణ, కంపరపాలెం

వరి మాత్రమే పండిస్తున్నాం



ఆకతాయిల వల్ల ఇక్కడ పంట పొలాల్లో వరి మాత్రమే పండిస్తున్నాం. ఆ తర్వాత మరే పంటలు పండించలేకపోతున్నాం. గతంలో ఇక్కడి వరి చేనుని తగులబెట్టేశారు. తిండి గింజలు లేక అవస్థలు పడ్డాం. వీరి పీడ ఎప్పుడు పోతుందో...?

-కంపర అప్పారావు, కంపరపాలెం

లాభం వచ్చే పంటకు దూరం



సరుగుడు తోట వేస్తే నికరంగా లాభాలు వస్తాయి. కాని మందుబాబుల బెడదతో తోట వేయకుండా భూమిని ఖాళీగా వదిలేయాల్సి వస్తోంది. ఐదేళ్లలో కనీసంగా రూ.లక్షకు పైగా లాభం వస్తుంది. కాని కొన్నేళ్లుగా మా పొలం ఖాళీగా వదిలేశాను. చాలా బాధగా ఉంది.

-కంచిపాటి అప్పలరాజు, కంపరపాలెం

నందమూరినగర్‌లో కార్డన్ సెర్చ్

- మూడు వాహనాల సీజ్



కార్డన్ సెర్చ్‌లో వాహన పత్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ అప్పలనాయుడు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు నందమూరినగర్ ప్రాంతంలో గోపాలపట్నం పోలీసులు సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. అనుమానితుల వివరాలపై ఆరా తీశారు. వాహనాలు, వాటిపత్రాలను తనిఖీ చేశారు. నంబర్లు లేని, తగిన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. ప్రజలకు నేరాలు జరుగుతున్న తీరును వివరించారు. ఈ సందర్భంగా మూడు వాహనాలు సీజ్ చేశారు. సీఐ గొలగాని అప్పారావు మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టామని తెలిపారు. నగరంలో శాంతి భద్రతలను అదుపులో పెట్టాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. అనుమానిత వ్యక్తులకు చోటు ఇవ్వవద్దని సూచించారు. వాహనాల పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు రామారావు, అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

గౌరీసేవా సంఘం నూతన కమిటీకి అభినందన

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్‌నగర్ గౌరీ సేవా సంఘం నూతన కమిటీ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే గణబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘ సభ్యుల సంక్షేమానికి అంతా శ్రమించాలని ఆకాంక్షించారు. సంఘం అధ్యక్షుడు మద్దల మణికుమార్, ప్రధాన కార్యదర్శి బీశెట్టి సంతోష్‌కుమార్, కోశాధికారి కర్రి నూకరాజు, ఉపాధ్యక్షులు పెంటకోట హరిబాబు, వెంకటఅప్పారావు తదితరులు ఉన్నారు.

రాజ్యాంగ నిర్మాత... స్ఫూర్తి ప్రదాత

భారతరత్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన అందించిన రాజ్యాంగంతో అన్ని వర్గాలకు ప్రజలకు సమాన హక్కులు సిద్ధించాయని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో నడుద్దామని నాయకులు, వక్తలు పిలుపునిచ్చారు. పలు చోట్ల సేవా కార్యక్రమాలు చేపట్టారు.




ఎక్స్‌సర్వీస్ మెన్ కాలనీలో నివాళులర్పిస్తున్న నాయకులు



దళితసేన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



గుల్లలపాలెం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మల్కాపురం సీఐ విద్యసాగర్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రమణ



యల్లపువానిపాలెం ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేస్తున్న ఆళ్ల పైడిరాజు



గాజువాక డిపో వద్ద నివాళులర్పిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకుడు భోగవిల్లి నాగభూషణం

ఘనంగా అంబేడ్కర్ జయంతి

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు యల్లపువానిపాలెం ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి ఆళ్ల పైడిరాజు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ సీనియర్ నాయకుడు ఎస్కే రెహమాన్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్, 92వ వార్డు గోపాలపట్నం ప్రాంతాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు ప్రభుత్వ విప్ గణబాబు పూల మాలలు వేసి నివాళులర్పించారు.
- యల్లపువానిపాలెం ఎస్సీకాలనీ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి సీపీఎం నాయకులు గంపల అప్పారావు విజయలక్ష్మి ఆధ్వర్యంలో నివాళులర్పించారు.
- ఎన్ఎస్‌టీఎల్‌లోని నేవల్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్‌లో బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ అంబేడ్కర్ మార్గాన్ని అందరూ అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, అడిషనల్ కంట్రోలర్ ఏరియా అకౌంట్ ఆఫీస్ (నేవీ) బాల జవహర్, డైరెక్టర్ జనరల్ (నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్) డాక్టర్ ఆర్‌వీ హరి ప్రసాద్ అంబేడ్కర్ గొప్పతనాన్ని వివరించారు. పేద మహిళలు, నిరుపేదలకు ఎన్ఎస్అండ్ ఎం క్లస్టర్ ప్రథమ మహిళ శశిశ్రీ , ఎన్ఎస్‌టీఎల్ ప్రథమ మహిళ ఐలిన్ అబ్రహం, ఎన్ఎస్‌టీఎల్ కల్యాణ్ మంచ్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ దాస్ చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. విశాఖ మనసు అనాథ ఆశ్రమానికి రూ. 10వేలు ఆర్థిక సాయం అందించారు.
- చంద్రనగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి స్థానికులు పూల మాలవేసి నివాళులర్పించారు. స్థానికుడు డేవిడ్, కేఎస్ చలం, కొత్తాబత్తుల రత్న కుమారి, వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు శాంతిగిరి కాలనీ అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ పశ్చిమ నాయకుడు పొలిమేర శ్రీను పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి పరిసర ప్రాంతాలను శుభ్ర పరిచారు.

- గాజువాక ఆర్టీసీ డిపో వద్ద ఎస్సీ,ఎస్టీ నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి ఘటించారు. ఇక్కడ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
- 59వ వార్డు ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రామ్మోహన్‌నాయుడు నివాళులర్పించారు.
- 60వ వార్డు గుల్లలపాలెంలో మల్కాపురం సీఐ విద్యసాగర్, వైఎస్సార్‌సీపీ నాయకులు మళ్ల ధనలత, నూకరెడ్డి, ఎస్సీ నాయకులు రాజు తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలను వేసి నివాళులర్పించారు.

కులనిర్మూలన కోసం కృషి

కంచరపాలెం: అంటరానితనం, కుల నిర్మూలన కోసం కృషి చేసిన అంబేడ్కర్ దార్శనికుడని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు పేర్కొన్నారు. ఊర్వశికూడలిలోని దళిత సేన కార్యాలయంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గొల్లమాల అప్పారావు పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పుచ్చ కామేశ్వరరావు, తాటిపూడి సీతారాం, చింతల మల్లికార్జున్, పట్నాల ఝాన్సీ, గొల్లమాల మీనా తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

విశాఖ విద్య: పేదల బతుకుల్లో వెలుగులు నింపిన గొప్ప వ్యక్తి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ అని జాతీయ నేవల్ డాక్ యార్డు(కేటీబీ) అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల చిరంజీవి అన్నారు. సోమవారం 90వ వార్డు కేటీబీ అసోసియేషన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

- 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లే అవుట్ హెల్తీ వాకర్స్ పార్క్ లో వాకర్స్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రీన్ బెల్ట్ ఆవరణలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఈటి సత్యనారాయణ, నాగేశ్వరరావు, విజయప్రసాద్ పాల్గొన్నారు.
- ఎన్ఏడీ ఫ్లై ఓవర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి దళిత సంఘాల ఆధ్వర్యంలో పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సోడదాసి సుధాకర్, తులసీరామ్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు సింథియా రిక్రియేషన్ క్లబ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి షిప్‌యార్డు ఎస్సీ, ఎస్టీ లైజనింగ్ ఆఫీసర్ అశోక్‌కుమార్, కంపెనీ సెక్రటరీ ఇనయతుల్లా బేగ్, జీఎం హెచ్‌ఆర్ కె.కోటేశ్వరరావు, సెల్ ఆఫీసర్ రాంప్రసాద్, మిథిలేష్‌కుమార్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. షిప్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యకమంలో అధ్యక్షులు అప్పలకొండ, ప్రధానకార్యదర్శి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు కె.కొండలరావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

- త్రినాథపురం, దుర్గానగర్, ఎస్సార్‌కాలనీ, ఎన్టీఆర్‌కాలనీ, అంబేడ్కర్‌కాలనీ, ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మల్కాపురం బీజేపీ మండలాధ్యక్షుడు మేరువ అనిల్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ములకలపల్లి ప్రకాష్, వెంకటరావు, పంచదార్ల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి

- జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవలో రాష్ట్ర ఎస్సీ సెల్ మానటరింగ్ సెక్రటరీ పూండీ మల్లేష్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సూరాడ పెంటారావు, బోను ఈశ్వరరావు, అడపాక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎస్‌టీఎల్‌లో మనసు సంస్థకు నగదు అందిస్తున్న డైరెక్టర్ అబ్రహం వర్గీస్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మల్లేష్, ఇతర నాయకులు



చంద్రనగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేస్తున్న నాయకులు



లక్ష్మీనగర్ ఎఫ్‌బ్లాక్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేస్తున్న విప్ గణబాబు

సేవా మార్గంలో వ్యర్థాల డంపింగ్

ఫోకస్



జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం హనుమాన్ ఆలయం వెనుక మార్గం నుంచి గొల్లవీధికి వెళ్లే రోడ్డులో స్థానికులు వ్యర్థాలను నిర్లక్ష్యంగా డంప్ చేస్తున్నారు. వరుస సెలవులు రావడంతో ఆ ప్రాంత పారిశుధ్య కార్మికులు వాటిని తొలగించ లేదు. వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వెదజల్లుతున్నాయి.

– మల్కాపురం

ఆశ్రమం నుంచి కుటుంబం చెంతకు




అస్సాంలోని కుటుంబ సభ్యుల చెంతకు చేరిన ప్రభాత్



ఆశ్రమానికి తీసుకొస్తున్న మమత (ఫైల్)

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం పొందిన అస్సాంకు చెందిన వ్యక్తిని సోమవారం కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. వివరాలు... ఆర్నెల్ల కిందట కంచరపాలెం ఫుట్ పాత్ మీద ప్రభాత్ అనే వ్యక్తి ఉండడం గమనించిన బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత అతనికి ఆశ్రయం కల్పించారు. కుటుంబ సభ్యులు వివరాలు రాబట్టారు. అస్సాం దగ్గర కిటోల్ లంగ్సో గ్రామం అని, ఉపాధి కోసం తన స్నేహితుడితో బయటకు వస్తే మోసం చేశాడని వివరించాడు. దీంతో షెల్టర్ మేనేజర్ మమత ప్రత్యేక చొరవ తీసుకొని ఓ స్వచ్ఛంద సంస్థ సహాయంతో అతన్ని అస్సాంలో ఉన్న కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. ప్రభాత్‌ను చూసి భార్య పిల్లలు ఆనందంతో మేనేజర్ మమతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వైభవంగా పెంటమాంబ పండగ



పూజలందుకున్న పెంటమాంబ



జాతరలో భక్తుల సందడి

పెదగంట్యాడ: నెల్లిముక్కు పరిసర 14 గ్రామాల ఆరాధ్య దేవత, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పెంటమాంబ అమ్మవారి పండగను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. వేకువజాము నుంచే భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. దీంతో ఆలయం మొత్తం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం హోమం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి పండగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బండ్ల వేషాలు, సాముగరిడీలు, తప్పెట గుళ్లు, విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు గొందేశి మహేశ్వరరెడ్డి, పులి వెంకటరమణా రెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, గొందేశి సత్యారావు, పిట్ట కుంచారావు, శ్రీరామ్మూర్తి, గొందేశి సుమన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com